RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:144

గురువారం
జూన్ 4, 2026

పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



## కర్ణాటక సీఎంగా డీకే ప్రమాణం

2లో

# జనసేన రాక.. పొలిటికల్ కాక!

**వేద న్యూస్, ఎల్.కే (ప్రత్యేక ప్రతినిధి)**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా వేడెక్కింది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్ రేట్‌తో సంచలన విజయం సాధించి, ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జనసేనాని పవన్ కల్యాణ్.. ఇప్పుడు తెలంగాణపై ఫోకస్ చేస్తుండడంతో రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల వాతావరణం రాజుకుంది. తెలంగాణలో జనసేన పార్టీ ఎంట్రీ ఇస్తుందని, రాబోయే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించడంతో.. ఇక్కడి కాంగ్రెస్, బీఆర్ఎస్, తెలంగాణ రక్షణ సేన లాంటి ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఒక్కసారిగా అలర్ట్ అయ్యాయి. హైదరాబాద్‌లో పవన్ నిర్వహించతలపెట్టిన భారీ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై ఆయన మీడియా ముఖంగా 'తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా?!' అంటూ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ఈ ఎంట్రీ వెనుక మిత్రపక్షమైన బీజేపీ హస్తం ఉందంటూ కాంగ్రెస్ విస్తృత ప్రచారం చేస్తుండగా, గత వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ క్షమాపణ చెప్పాకే ఇక్కడ అడుగు పెట్టాలని కాంగ్రెస్ నేతలు, తెలంగాణవాదులు అడ్డుకట్ట వేస్తుండటంతో రాష్ట్రంలో 'పవన్ వర్సెస్ కాంగ్రెస్'గా రాజకీయం మారిపోయింది.




## తెలంగాణలో 'పవన్' ఎంట్రీతో అన్నిపార్టీల అలర్ట్

- ఎన్నికల బరిలోకి నిలుస్తామంటూ అధికారికంగా ప్రకటన
- జనసేనాని ప్రకటనతో మారిన సమీకరణాలు
- రాష్ట్రంలో పవన్ వర్సెస్ కాంగ్రెస్ రాజకీయం
- మిగతా పార్టీల్లోనూ మొదలైన అలజడి
- మాటల వాడి పెంచుతున్న హస్తం పార్టీ, బీఆర్ఎస్, టీఆర్ఎస్
- పవన్ ఎంట్రీ వెనుక బీజేపీ హస్తం అంటూ ప్రచారం
- కాంగ్రెస్ మాటలను తిప్పికొడుతున్న జనసేన సైన్యం
- సరికొత్త వ్యూహాలతో కదులుతున్న రాజకీయం

2లో



## రేపటి నుంచే కొత్త భూముల ధరలు!

- శాస్త్రీయ అధ్యయనం ఆధారంగా నిర్ణయం
- మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విలువల సవరణ
- భూ లావాదేవీల్లో పారదర్శకతే లక్ష్యం
- ప్రాంతాల అభివృద్ధిని పరిగణనలోకి తీసుకున్నాం
- ఫ్లాట్లు, ప్లాట్లు, వ్యవసాయ భూములకు కొత్త రేట్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2లో

## ప్రాజెక్టు పేరుతో తప్పుదోవ పట్టిస్తున్నారు

- కాంగ్రెస్ హయాంలోనూ పరిష్కారం కాలేదు
- ప్రకటనలతో కాదు.. చర్యలతో చిత్తశుద్ధి నిరూపించాలి
- మహారాష్ట్రను ఒప్పించే ప్రయత్నం చేయాలి
- ముఖ్యమంత్రి దీక్షకు సిద్ధమా
- తుమ్మిడిహట్టిపై రేవంత్‌ను టార్గెట్ చేసిన కేటీఆర్



## తెలంగాణ-జర్మనీ భాగస్వామ్యానికి కొత్త ఊపు



- నైపుణ్యాభివృద్ధిపై కీలక ఒప్పందం
- పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో సహకారం
- థూరింగియా ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్ భేటీ
- యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశాలపై చర్చ
- జర్మన్ భాషా శిక్షణ కేంద్రం ప్రతిపాదన
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ
- సెమీకండక్టర్ పెట్టుబడులకు తెలంగాణ ఆహ్వానం
- పరస్పర అభివృద్ధికి కలిసి పనిచేయాలని నిర్ణయం

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం, జర్మనీకి చెందిన థూరింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. థూరింగియా రాష్ట్ర మంత్రి-అధ్యక్షుడు మారియో ఫోకట్ నేతృత్వంలోని ప్రతినిధి

మిగతా 2వ పేజీలో

## మోడీ ఖాతాలో మరో చారిత్రక రికార్డు

- నెహ్రూ అత్యధిక కాలం ప్రధానమంత్రి రికార్డుకు బ్రేక్
- జూన్ 10న కొత్త మైలురాయి చేరనున్న నరేంద్రుడు
- ఎన్నికల్లో గెలిచి అత్యధిక కాలం ప్రధాని పదవిలో కొనసాగిన నేతగా ఘనత
- ఇప్పటికే ఇందిరా గాంధీ రికార్డును అధిగమించిన మోడీ
- వరుసగా మూడు సార్లు ప్రధానిగా కొనసాగుతున్న అరుదైన నాయకుడు
- భారత రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది
- పదకొండేళ్ల పాలనకు మరో గుర్తింపు

2లో



## ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

### 21 మంది మృత్యువాత.. పలువురి పరిస్థితి విషమం

- మంటల్లో చిక్కుకున్న విదేశీయులు
- భోజనశాల నుంచి ప్రారంభమైన అగ్ని
- పై అంతస్తులకు వేగంగా వ్యాపించిన మంటలు
- ప్రమాద కారణాలపై దర్యాప్తు ప్రారంభం
- బాధిత కుటుంబాలకు ప్రధాని మోడీ సంతాపం





**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం జరిగిన ఘోర అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్ ప్రాంతంలోని ఓ భవనంలో చెలరేగిన మంటల కారణంగా 21 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల్లో విదేశీ పౌరులు కూడా ఉన్నట్లు సమాచారం. పోలీసుల వివరాల ప్రకారం, భవనం దిగువ అంతస్తులో ఉన్న భోజనశాలలో మంటలు చెలరేగి వేగంగా పై అంతస్తులకు వ్యాపించాయి. దీంతో భవనంలో బస చేస్తున్న వారు దట్టమైన పొగ, మంటల్లో చిక్కుకుపోయారు. ప్రమాదం సంభవించిన సమయంలో పలువురు నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

గురువారం | జూన్ 04, 2026

# మోదీ ఖాతాలో మరో చారిత్రక రికార్డు

- నెహ్రూ అత్యధిక కాలం ప్రధానమంత్రి రికార్డుకు బ్రేక్
- జూన్ 10న కొత్త మైలురాయి చేరనున్న నరేంద్ర మోదీ
- ఎన్నికల్లో గెలిచి అత్యధిక కాలం ప్రధాని పదవిలో కొనసాగిన నేతగా ఘనత
- ఇప్పటికే ఇందిరా గాంధీ రికార్డును అధిగమించిన మోదీ
- వరుసగా మూడు సార్లు ప్రధానిగా కొనసాగుతున్న అరుదైన నాయకుడు
- భారత రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది
- పదకొండేళ్ల పాలనకు మరో గుర్తింపు



**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత రాజకీయ చరిత్రలో మరో అరుదైన మైలురాయిని చేరుకోబోతున్నారు. జూన్ 10 నాటికి ఎన్నికల్లో విజయం సాధించి అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన నాయకుడిగా కొత్త రికార్డు సృష్టించనున్నారు. ఇప్పటివరకు ఈ ఘనత దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉండగా, మోదీ ఆ రికార్డును అధిగమించనున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ 1952 మే 13న ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, 1964 మే 27న మరణించే వరకు మొత్తం 4,398 రోజుల పాటు పదవిలో కొనసాగారు. జూన్ 10 నాటికి నరేంద్ర మోదీ 4,399 రోజులు ప్రధానిగా పూర్తి చేసి ఈ రికార్డును అధిగమించనున్నారు. నరేంద్ర మోదీ 2014 మే 26న తొలిసారిగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జరిగిన రెండు సాధారణ ఎన్నికల్లోనూ విజయం సాధించి వరుసగా మూడోసారి ప్రధానిగా కొనసాగుతున్నారు. దేశ రాజకీయాల్లో ఇది అరుదైన ఘట్టంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే వరుసగా అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన ఇందిరా గాంధీ రికార్డును కూడా మోదీ అధిగమించారు. దేశ రాజకీయ, సామాజిక పరిస్థితులు పూర్తిగా మారిన నేపథ్యంలో వరుస విజయాలతో ప్రధానిగా కొనసాగుతూ ఈ ఘనత సాధించడం విశేషంగా భావిస్తున్నారు. జూన్ 10న నెహ్రూ రికార్డును అధిగమించనున్న మోదీ, భారత రాజకీయ చరిత్రలో మరో చారిత్రక అధ్యాయాన్ని లిఖించనున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణ-జర్మనీ భాగస్వామ్యానికి కొత్త ఊపు



**మొదటి పేజీ తరువాయి**

బృందం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై పలు అంశాలపై చర్చలు జరిపింది. ఈ సందర్భంగా రెండు ప్రభుత్వాల మధ్య అధికారికంగా ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. తెలంగాణ అభివృద్ధి, ఆవిష్కరణల రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందని మారియో ఫోకట్ ప్రశంసించారు. భారత్–జర్మనీ సంబంధాల బలోపేతంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు యుగంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల పరిశ్రమల అవసరాలకు తగిన మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యమని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలు, పాలిటెక్నిక్ విద్యాసంస్థల అభివృద్ధిలో థూరింగియా సహకారం అందించాలని కోరారు. హైదరాబాద్‌లో జర్మన్ భాషా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు. దీనికి స్పందించిన మారియో ఫోకట్, తెలంగాణ–థూరింగియా పరిశ్రమలు, విద్యాసంస్థల భాగస్వామ్యంతో అవసరాల ఆధారిత నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను రూపొందించవచ్చని పేర్కొన్నారు. యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించేలా కలిసి పనిచేస్తామని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి పెట్టుబడులు, ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. జర్మనీకి చెందిన సెమీకండక్టర్ సంస్థల ప్రతినిధి బృందాన్ని తెలంగాణకు తీసుకువచ్చి పెట్టుబడి అవకాశాలు పరిశీలించాలని థూరింగియా ప్రతినిధులు సూచించారు. నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత, ఆవిష్కరణలు, పెట్టుబడుల రంగాల్లో థూరింగియాతో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

**మొదటి పేజీ తరువాయి**



పై అంతస్తుల నుంచి కిందకు దూకగా, స్థానికులు వెంటనే స్పందించి రక్షణ చర్యలు చేపట్టారు. స మాచార ం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఎనిమిది ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర బృందాలు కలిసి 40 మందికి పైగా బాధితులను రక్షించి సమీప ఆసుపత్రులకు తరలించారు. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విదేశాల నుంచి వైద్య చికిత్సల కోసం వచ్చిన వారు ఎక్కువగా ఈ భవనంలో బస చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఆఫ్రికా, మధ్య ఆసియా దేశాలకు చెందిన వారు అక్కడ ఉన్నట్లు వెల్లడైంది. అగ్నిప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు.

# జనసేన రాక.. పొలిటికల్ కాక!

**వేద న్యూస్, ఎల్.కే (ప్రత్యేక ప్రతినిధి):**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా వేడెక్కింది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో సంచలన విజయంతో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జనసేనాని పవన్ కళ్యాణ్.. ఇప్పుడు తెలంగాణపై పంజా విసరడానికి సిద్ధమవడంతో రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల వాతావరణం రాజుకుంది. తెలంగాణలో జనసేన కచ్చితంగా ఎంట్రీ ఇస్తుందని, రాబోయే అన్ని ఎన్నికల్లోనూ కచ్చితంగా పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించడంతో.. ఇక్కడి ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఒక్కసారిగా అలర్ట్ అయ్యాయి. ఇప్పటివరకు కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్టుగా సాగుతున్న రాష్ట్ర రాజకీయం.. పవన్ రాకతో సరికొత్త సమీకరణాలకు దారితీస్తోంది.




### 'తెలంగాణ మీ అయ్య జాగీరా?!' అంటూ పవన్ ఆగ్రహం!

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో జనసేన శ్రేణులతో భారీ సభ నిర్వహించేందుకు పవన్ ప్లాన్ చేయగా.. శాంతిభద్రతల సాకుతో పోలీసులు ఆ సభకు అనుమతి నిరాకరించారు. ఈ పరిణామంపై పవన్ మీడియా సమావేశంలో ఆవేశంగా మాట్లాడుతూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా?!' అంటూ నిలదీశారు. తెలంగాణ తనకు ఎంతో ఆత్మీయమైన నేలని, ఎవరి బెదిరింపులకూ భయపడేది లేదని స్పష్టం చేశారు. ఇకపై తానే స్వయంగా తెలంగాణ అంతటా తిరుగుతానని, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ జనసేన జెండా ఎగరేయడమే లక్ష్యంగా బరిలోకి దిగుతామని సంచలన ప్రకటన చేశారు. ఈ వ్యాఖ్యలతో రాష్ట్రంలో 'పవన్ వర్సెస్ కాంగ్రెస్' అన్నట్టుగా వాతావరణం మారిపోయింది.

### పెరిగిన జనసేన, కాంగ్రెస్ మాటల వేడి!

మరోవైపు పవన్ కల్యాణ్ ఎంట్రీని కాంగ్రెస్ పార్టీ, స్థానిక తెలంగాణవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై పవన్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ.. ఇక్కడి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే తెలంగాణ మట్టిపై పవన్ సభలు పెట్టుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను తెలంగాణ వ్యతిరేకిగా చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు విమర్శల దాడి పెంచగా.. జనసైనికులు సైతం అంతే స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై భగ్గుమంటున్నారు. అయితే తాను ఎన్నడూ తెలంగాణను వ్యతిరేకించలేదని, కేవలం పార్లమెంట్‌లో విభజన జరిగిన తీరును మాత్రమే తప్పుపట్టానని పవన్ గట్టిగా సమర్థించుకుంటున్నారు.

### అన్ని పార్టీలు అలర్ట్

రాష్ట్రంలో ఎన్నికల సమరానికి ఇప్పటికే సిద్ధమవుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, తెలంగాణ రక్షణ సేన లాంటి పార్టీలకు పవన్ కళ్యాణ్ రూపంలో సరికొత్త సవాలు ఎదురైంది. మొన్నటివరకు కవిత పార్టీతో పరిణామాలు మారుతాయని భావించిన తరుణంలో.. ఇప్పుడు పవన్ నేరుగా క్షేత్రస్థాయిలోకి వస్తుండటంతో ఓట్ల చీలికపై అన్ని పార్టీల్లోనూ గుబులు మొదలైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ, ఆంధ్రా సరిహద్దు జిల్లాల్లోనూ జనసేనకు ఉన్న బలమైన యువ ఓటు బ్యాంక్, సెటిలర్ల మద్దతు ఏ పార్టీ కొంప ముంచుతుందోనని ప్రధాన పార్టీల అధినేతలు లెక్కలు వేసుకుంటున్నారు.

## తెలంగాణలో 'పవన్' ఎంట్రీతో అన్నిపార్టీల అలర్ట్

- ఎన్నికల బరిలోకి నిలుస్తామంటూ అధికారికంగా ప్రకటన
- జనసేనాని ప్రకటనతో మారిన సమీకరణాలు
- రాష్ట్రంలో పవన్ వర్సెస్ కాంగ్రెస్ రాజకీయం
- మిగతా పార్టీల్లోనూ మొదలైన అలజడి
- మాటల వాడి పెంచుతున్న హస్తం పార్టీ, బీఆర్ఎస్, టీఆర్ఎస్
- పవన్ ఎంట్రీ వెనుక బీజేపీ హస్తం అంటూ ప్రచారం
- కాంగ్రెస్ మాటలను తిప్పికొడుతున్న జనసేన సైన్యం
- సరికొత్త వ్యూహాలతో కదులుతున్న రాజకీయం

### బీజేపీ ప్లాన్ అంటూ..

పవన్ కల్యాణ్ తెలంగాణ ఎంట్రీ వెనుక మిత్రపక్షమైన బీజేపీ హస్తం ఉందంటూ కాంగ్రెస్ గట్టిగా ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓట్లను చీల్చడం ద్వారా తెలంగాణలో లాభపడాలనేది కమలదళం వ్యూహంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగానే పవన్ తెలంగాణపై ఫోకస్ చేయడాన్ని బీజేపీ నేతలు ఎక్కడా నెగెటివ్‌గా కామెంట్ చేయడం లేదు. ఇరు పార్టీల మధ్య మిత్రధర్మాన్ని కొనసాగిస్తూనే వచ్చే ఎన్నికల్లో ముందుకు సాగి.. అవసరమైతే ఏపీ తరహాలోనే ఇక్కడ కూడా కలిసి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా.. కాంగ్రెస్, బీఆర్ఎస్, తెలంగాణ రక్షణ సేన, జనసేనాని, బీజేపీ పార్టీల ఫోకస్‌తో తెలంగాణ రాజకీయం ఇప్పుడు రసవత్తరంగా మారింది.

# రేపటి నుంచే కొత్త భూముల ధరలు!

**వేద న్యూస్, హైదరాబాద్**



రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువల సవరణను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం మేరకు సవరించిన భూముల విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఆర్థిక నిపుణుల నివేదికలు, ఉన్నతాధికారుల సలహాలు, క్షేత్రస్థాయి అధ్యయనాల ఆధారంగా కొత్త విలువలను నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రాంతాల వారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల సంఖ్య, బహిరంగ మార్కెట్ పరిస్థితులు, ప్రభుత్వ విలువల మధ్య వ్యత్యాసాలను సమగ్రంగా పరిశీలించినట్లు పేర్కొన్నారు. గతంలో భూముల ధరల నిర్ణయంలో ఏర్పడిన అసమానతలను సరిదిద్దేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ విలువల పునర్విమర్శ చేపట్టినట్లు తెలిపారు. ఉప రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ప్రత్యేక కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సవరించిన విలువలను రూపొందించాయని చెప్పారు. ప్రాంతాల అభివృద్ధి, భూముల డిమాండ్, కొత్త రహదారులు, పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఫ్లాట్ల విషయంలో గతంలో ఉన్న అసమానతలను తొలగిస్తూ కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తులకు ఒకే రేటు వర్తింపజేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిర్మాణ సామగ్రి, కార్మిక వ్యయాలు పెరిగిన నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్‌సీసీ, నాన్ ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను కూడా సవరించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, భూలావాదేవీల్లో పారదర్శకత పెంచేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

# ప్రాజెక్టు పేరుతో తప్పుదోవ పట్టిస్తున్నారు

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**



- కాంగ్రెస్ హయాంలోనూ పరిష్కారం కాలేదు
- ప్రకటనలతో కాదు.. చర్యలతో చిత్తశుద్ధి నిరూపించాలి
- మహారాష్ట్రను ఒప్పించే ప్రయత్నం చేయాలి
- ముఖ్యమంత్రి దీక్షకు సిద్ధమా
- తుమ్మిడిహట్టిపై రేవంత్‌ను టార్గెట్ చేసిన కేటీఆర్

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. తుమ్మిడిహట్టి అంశాన్ని ప్రజల దృష్టి మళ్లించే రాజకీయ ప్రయత్నాలకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు సాధ్యంకాదని గతంలో మహారాష్ట్రలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రే లేఖ రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రాజెక్టు ఎత్తును 152 మీటర్ల వరకు పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడూ అంగీకరించలేదని, దీనికి సంబంధించిన అధికారిక ఆధారాలు ఉన్నాయని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న సమయంలో కూడా మహారాష్ట్రను ఒప్పించలేకపోయారని విమర్శించారు. ఇప్పుడు అదే అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరైన విధానం కాదన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించే చర్యలు చేపట్టాలని సూచించారు. కేవలం ప్రకటనలతో సమస్యలు పరిష్కారం కావని, రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టి చర్యలు అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ అంశంపై అంత పట్టుదల ఉంటే మహారాష్ట్ర ముఖ్యమంత్రి నివాసం ముందు నిరాహార దీక్ష చేయాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అలా చేస్తేనే తెలంగాణ హక్కుల కోసం పోరాడుతున్నట్లు ప్రజలు నమ్ముతారని వ్యాఖ్యానించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశం మరోసారి రాజకీయ చర్చకు దారితీయగా, అధికార–ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు మరింత వేడెక్కే అవకాశం కనిపిస్తోంది.

# కర్ణాటక సీఎంగా డీకే ప్రమాణం

- ప్రమాణం చేయించిన గవర్నర్
- పద్నాలుగు మంది మంత్రులతో శివకుమార్ క్యాబినెట్
- సోనియా గాంధీ శుభాకాంక్షలు



**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆయనతో ప్రమాణం చేయించారు. రాజ్యాంగ ప్రతిని చేతపట్టుకుని డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మహ్మద్ అజహరుద్దీన్, మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమం ఘనంగా జరిగింది. కొత్త మంత్రివర్గంలో మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు యతీంద్రకు స్థానం లభించింది. పరమేశ్వర ఏకైక ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం పద్నాలుగు మంది మంత్రులు కొత్త మంత్రివర్గంలో భాగంగా ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారని డీకే శివకుమార్ వెల్లడించారు. పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని ఆమె సూచించినట్లు తెలిపారు. తన నాయకత్వంపై సోనియా గాంధీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. విలేకరులతో మాట్లాడిన డీకే శివకుమార్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా తనను నియమించినది కూడా సోనియా గాంధీయేనని గుర్తు చేశారు. మొదటి నుంచి తనపై ఆమెకు నమ్మకం ఉందని చెప్పారు. ఆమె సూచనల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. కర్ణాటక అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుతో కర్ణాటక రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

వేద న్యూస్

గురువారం జూన్ 04 , 2026

# ఎన్ఎఫ్‌బీఎస్ దరఖాస్తులకు మోక్షం ఎప్పుడో?

- అధికారుల నిర్లక్ష్యంతో నెలలుగా పెండింగ్‌లోనే
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధిత కుటుంబాలు
- ఆర్థిక సాయం కోసం నిరీక్షణ
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరుతున్న లబ్ధిదారులు




**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కుటుంబ పోషకుడిని కోల్పోయిన నిరుపేదలు ప్రభుత్వ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఇప్పటివరకు మంజూరు కాకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులు అవసరమైన అన్ని ధ్రువపత్రాలు సమర్పించి నెలలు గడుస్తున్నా తమ దరఖాస్తులపై ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల కార్యాలయాల్లో దరఖాస్తులు మూలకు మురుగుతున్నాయని, దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకం లక్ష్యం నీరుగారుతోందని పేర్కొంటున్నారు. కుటుంబ పెద్ద మరణంతో ఇప్పటికే ఆర్థికంగా కుంగిపోయిన తమకు ప్రభుత్వం అందించే సహాయం అత్యంత అవసరమని, అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు కార్యాలయాలకు వెళ్లినా స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న ఎన్ఎఫ్‌బీఎస్ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి వెంటనే ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. అలాగే జాప్యానికి గల కారణాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు సకాలంలో అమలైతేనే నిజమైన ఫలితాలు ప్రజలకు అందుతాయని సామాజిక వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఎన్ఎఫ్‌బీఎస్ దరఖాస్తులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని బాధిత కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.

# సిరిసిల్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- కిరాణా, పాన్ షాపుల్లో విస్తృత సోదాలు
- గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలంటూ వార్నింగ్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పట్టణంలోని కిరాణా దుకాణాలు, పాన్ షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార భద్రత నిబంధనల అమలును అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నిషేధిత పాన్ పరాగ్, గుట్కా వంటి హానికర పదార్థాల విక్రయాలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణ యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించి ఆహార భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పొగాకు, గుట్కా వంటి ఆరోగ్యానికి హానికరమైన ఉత్పత్తులకు ప్రజలు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ప్లాస్టిక్ రహిత ధర్మారం దిశగా కఠిన చర్యలు

- దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు
- ప్లాస్టిక్ వినియోగంపై నోటీసుల జారీ



**వేద న్యూస్, కోనరావుపేట:**

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్లాస్టిక్ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి బండారి మనీష ఆధ్వర్యంలో గ్రామంలోని కిరాణా దుకాణాలు, వ్యాపార సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులతో కలిసి వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ కవర్లు, నాణ్యత లేని సంచుల వినియోగాన్ని వెంటనే నిలిపివేసి, వాటికి బదులుగా పేపర్ బ్యాగులు, జనపనార సంచులను ఉపయోగించాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా ధర్మారాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని అధికారులు హెచ్చరించారు.

# రూసో ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ

- కేయూ క్రాస్‌లో సామాజిక సేవా కార్యక్రమం




**వేద న్యూస్, హనుమకొండ:**

కాకతీయ విశ్వవిద్యాలయం మహిళ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల రూసో ఆధ్వర్యంలో కేయూ క్రాస్ వద్ద బుధవారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. భిక్షాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ మండుటెండల్లో ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, బాటసారులు, చిరు వ్యాపారులకు ఉపశమనం కలిగించేలా మహిళ ఇంజనీరింగ్ కళాశాల చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. భిక్షాలు మాట్లాడుతూ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్లు కలిసి సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దాహంతో ఉన్న ప్రజలకు తమ వంతు సేవ అందించాలనే ఉద్దేశంతో ఉచిత మజ్జిగ పంపిణీ నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వీరు నాయక్, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ సభ్యులపై బీజేపీ ఫిర్యాదు

**వేద న్యూస్, రుద్రూర్:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వర్ని మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఇండియా జాతీయ జెండా రూపంలో కేక్ తయారు చేసి కట్ చేయడం ద్వారా జాతీయ పతాకాన్ని అవమానించారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా, వైస్ చైర్మన్ కొత్తిమీర్కర్ లక్ష్మణ్, డైరెక్టర్ పార్వతి ప్రవీణ్, నాగయ్య, భారి, గంగారాం తదితరులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని వినతిపత్రంలో కోరారు. జాతీయ జెండా గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు బోజగొండ అనిల్, నాయకులు వడ్ల సాయినాథ్, రేపల్లి సాయిప్రసాద్, కుమ్మరి గణేష్, తీగుళ్ల రాజా వరప్రసాద్, బైండ్ల బాలరాజ్, ధర్మారం వెంకటేష్ తదితరులు ఉన్నారు.



# గౌడ సంఘం అధ్యక్షుడిగా రాజేందర్ గౌడ్



**వేద న్యూస్, సిరికొండ:**

సిరికొండ మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీడీసీ సభ్యుడిగా అంగూరి రాజా గణేష్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడిగా చేపూరి రాజేందర్ గౌడ్, కోశాధికారిగా బోల్గం శివకుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా రామస్వామి గౌడ్, కార్యదర్శిగా పెంటయ్య గౌడ్, సలహాదారులుగా లక్ష్మీనారాయణ గౌడ్, రాజేందర్ గౌడ్, పెద్దరాజు గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యుడు రాజా గణేష్ గౌడ్, సంఘ అధ్యక్షుడు రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, సభ్యుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గౌడ సంఘం మాజీ అధ్యక్షులు చేపూరి రాజా గౌడ్, రాములు గౌడ్, హనుమ గౌడ్, హరీష్ గౌడ్, రాకేష్ గౌడ్‌తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

- ఏడుపాయలలో ప్రత్యేక పూజలు, కేక్ కటింగ్
- కాంటారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ
- భారీగా తరలివచ్చిన నాయకులు, అభిమానులు



**వేద న్యూస్, పాపన్నపేట:**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు బుధవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాంటారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడుపాయల వనదుర్గ మాత ఆలయంలో హరీష్ రావు పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజగోపురం వద్ద కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంటారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి హరీష్ రావు ఎల్లప్పుడూ ముందుంటారని, తెలంగాణ రాజకీయాల్లో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుడని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో హరీష్ రావు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. హరీష్ రావు సంపూర్ణ ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో తెలంగాణ ప్రజలకు మరింత సేవ చేయాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోములు, బాలాగౌడ్, గురుమూర్తి గౌడ్, శ్రీనాథ్, సర్పంచులు సురేష్, గంట రాణి సుధీర్, సొంగ పవిత్ర దుర్గయ్య, కాశీనాథ్ రావు, శ్రీనివాస్, కొండల్ రెడ్డి, చంద్రమోహన్ గౌడ్, జగదీష్ చారి, కిరణ్ గౌడ్, నవీన్, సాయి, దినేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం జూన్ 04 , 2026

# మండల విద్యాశాఖ అధికారికి సన్మానం

**- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందనలు**



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన లయన్ రామ్ సింగ్‌ను లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేవీ మోహన్, సభ్యులు లయన్ శ్యామ్‌సుందర్ పహాడే, పత్తి రాము, గుండూరి ప్రశాంత్ గౌడ్, పుట్టి సాగర్, గెంటిల గంగాధర్, గాండ్ల మధు, అడప సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# బాట కోసం బరితెగింపు..!

- సర్పంచ్ దౌర్జన్యంతో దళిత కుటుంబంపై దాడి
- ఉద్రిక్తతంగా మారిన పంచాయితీ
- అధికారుల ముందే ఘర్షణ



**వేద న్యూస్, గద్వాల ప్రతినిధి:**

జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం గంగన్‌పల్లి గ్రామంలో బాట పంచాయతీ వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్లాట్‌కు సంబంధించిన వివాదం నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన పంచాయతీలో దళిత కుటుంబంపై దాడి జరిగినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో గ్రామ సర్పంచ్, ఆయన అనుచరుల పాత్రపై బాధితులు, గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం ప్రకారం, పంచాయతీ సమయంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో సర్పంచ్ ఒకే వర్గానికి మద్దతుగా వ్యవహరించారని, దళిత కుటుంబానికి వ్యతిరేకంగా దాడులు జరిగేలా ప్రోత్సహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నా మాటే శాసనం అన్న రీతిలో సర్పంచ్ వ్యవహరించడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఘటన జరిగిన సమయంలో సంబంధిత అధికారులు అక్కడే ఉన్నప్పటికీ పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంలో చొరవ చూపలేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. దళిత కుటుంబంపై దాడి జరుగుతుండగా అధికారులు మౌనంగా ఉండిపోయారని, ప్రజా పాలనలో ప్రజల కోసం పని చేయాల్సిన అధికారులు రాజకీయ నాయకులకు లోబడితే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, రెండు వర్గాల మధ్య వివాదం కొనసాగుతున్న సమయంలో సర్పంచ్ వ్యవహారశైలి మరింత ఉద్రిక్తతను పెంచిందని తెలుస్తోంది. అధికారుల సమక్షంలోనే ఘర్షణ జరిగినప్పటికీ ఎవరూ జోక్యం చేసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గంగన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# అగ్నిప్రమాద బాధితుడికి మేదరి సంఘం అండ

**- సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక సహాయం**



**వేద న్యూస్, ఇందల్వాయి:**

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇల్లు అగ్నికి ఆహుతై సర్వస్వం కోల్పోయిన పేద కూలీ మేదరి నర్సయ్య కుటుంబానికి మహేంద్ర మేదరి సంఘం ప్రతినిధులు అండగా నిలిచారు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మేదరి నర్సయ్య అద్దె ఇంటిలో నివాసం ఉంటుండగా, ఇటీవల జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో నిత్యావసర వస్తువులు, బట్టలు, గృహోపకరణాలు కాలిపోవడంతో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న మహేంద్ర మేదరి సంఘ సభ్యులు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచిస్తూ సంఘం తరఫున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విపత్కర సమయంలో స్పందించి బాధిత కుటుంబానికి చేయూతనందించిన మేదరి సంఘం నాయకులను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మేదరి సంఘం నాయకులు పిల్లి యుగంధర్, ధర్పల్లి ఎల్లయ్య, బాద గోవర్ధన్, పిల్లి నాగేష్, శివకుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాన్ని వ్యతిరేకించడం దురదృష్టకరం

**- కాంగ్రెస్ నాయకులపై సర్పంచ్ కుమారస్వామి విమర్శలు**



**వేద న్యూస్, నడికూడ:**

నడికూడ మండలం వరికోల్ గ్రామంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కాంగ్రెస్ నాయకులు రాజకీయ స్వార్థంతో వ్యతిరేకించడం దురదృష్టకరమని గ్రామ సర్పంచ్ దొగ్గేల కుమారస్వామి విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో, పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ భవనంలో యువత కోసం నూతన గ్రంథాలయం, కంప్యూటర్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఉపయోగపడే గ్రంథాలయాన్ని వ్యతిరేకించడం యువత భవిష్యత్తును దెబ్బతీయడమేనని అన్నారు. విజ్ఞానాన్ని పంచే విద్యా కేంద్రాలపై కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు చేయడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. యువత, విద్యార్థుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలను అడ్డుకునే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి చర్యలు కొనసాగితే ప్రజలు, విద్యార్థులు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మురాల భుజంగరావు, పాలకవర్గ సభ్యులు, పోశాల శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకటనలు చూసి తల్లిదండ్రులు మోసపోవద్దు



- విద్యార్థుల భవిష్యత్తుతో వ్యాపారం చేయొద్దు
- అనుమతులు లేని అకాడమీలను నమ్మొద్దు
- జేడీ లక్ష్మీనారాయణ పర్యటనను అడ్డుకుంటామన్న ఏఐఎఫ్‌బీ

**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్‌లో అనుమతులు లేకుండా నడుస్తున్న అకాడమీల ప్రచార కార్యక్రమాలను వ్యతిరేకిస్తామని, అవసరమైతే మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ పర్యటనను కూడా అడ్డుకుంటామని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, ఐఐటీ, జేఈఈ, నీట్ ఫౌండేషన్ పేరుతో నిర్వహిస్తున్న రిసోనెన్స్ అకాడమీ ప్రచార కార్యక్రమానికి జూన్ 4న జేడీ లక్ష్మీనారాయణ హాజరవుతున్నట్లు తెలిసిందన్నారు. విద్యార్థులకు కెరీర్ మార్గదర్శకత్వం, ప్రేరణ కల్పించే కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందని, అయితే అనుమతులు లేని విద్యాసంస్థలు, అకాడమీల ప్రచారానికి వస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆశలను కొందరు వ్యాపారంగా మార్చుకుంటున్నారని ఆరోపించిన ఆయన, ఎలైట్ హోటల్ వద్ద ధర్నా నిర్వహించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రకటనలు చూసి మోసపోవద్దని సూచించారు. నగరంలో అనుమతులు లేకుండా అకాడమీల పేరుతో నడుస్తున్న విద్యాసంస్థలపై ఆందోళనలు చేపడతామని, నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు తీసుకుని మాత్రమే అకాడమీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- మహిళా సమైక్య భవనాలకు శంకుస్థాపన



**వేద న్యూస్, పరకాల:**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం సంగెం మండలం మొండ్రాయి గ్రామంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో పలు గ్రామాల్లో నిర్మించనున్న మహిళా సమైక్య భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న మహిళా సమైక్య భవనాలు స్వయం సహాయక సంఘాల సమావేశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఉపాధి కార్యక్రమాలకు కేంద్రాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కుట్టు శిక్షణ ద్వారా కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే సమాజం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని పెంచడంతో పాటు, బ్యాంకు రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా శక్తి సూపర్ బజార్లు, వి-హబ్ సెంటర్లు, మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అవసరమైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు.

# కార్ల్ మార్క్స్ సిద్ధాంతమే మానవాళికి విముక్తి




- పెట్టుబడిదారీ వ్యవస్థకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయం
- పవన్ కల్యాణ్‌పై సీపీఐ నేత తక్కళ్లపల్లి విమర్శలు

**వేద న్యూస్, నల్లబెల్లి:**

ప్రపంచవ్యాప్తంగా సంక్షోభంలో కూరుకుపోతున్న పెట్టుబడిదారీ వ్యవస్థకు కమ్యూనిజమే ఏకైక ప్రత్యామ్నాయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో బుధవారం ప్రారంభమైన సీపీఐ వరంగల్ జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్ల్ మార్క్స్ సిద్ధాంతమే మానవాళికి దోపిడీ నుంచి విముక్తి మార్గాన్ని చూపిందని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన సాయుధ రైతాంగ పోరాటంలోనూ సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. భూమిలేని పేదలకు లక్షలాది ఎకరాల భూములను పంచిపెట్టిన ఘనత తమ పార్టీదేనని గుర్తుచేశారు. దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేస్తూ వామపక్షాల ఐక్యతతో ప్రజా పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా సమావేశంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై స్పందించిన తక్కళ్లపల్లి, ఆయనకు స్థిరమైన రాజకీయ సిద్ధాంతం లేదని విమర్శించారు. తెలంగాణ సంస్కృతిపై పూర్తి అవగాహన లేకుండానే వ్యాఖ్యలు చేస్తున్నారని, ఏపీలో ఒకలా, తెలంగాణలో మరోలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు అలాంటి రాజకీయాలను విశ్వసించరని అన్నారు. నల్లబెల్లి మండల కార్యదర్శి చింతకింది కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్.కె. బాష్‌మియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, కందిక చెన్నకేశవులు, వీరగోని శంకరయ్య, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం జూన్ 04 , 2026

## రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు

**– ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో విత్తనాలు**



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల రైతులకు వ్యవసాయ శాఖ శుభవార్త తెలిపింది. ప్రస్తుత వానాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని భూమి సారాన్ని పెంపొందించే పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే జీలుగ విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రజిత బన్న తెలిపారు. రైతుల సౌకర్యార్థం జీలుగ విత్తనాలను 30 కిలోల బ్యాగుల ప్యాకింగ్‌లో సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు పత్రాలతో నల్లబెల్లి మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి బయోమెట్రిక్ విధానం ద్వారా సబ్సిడీ ధరకు విత్తనాలు పొందవచ్చని తెలిపారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పచ్చిరొట్ట ఎరువుల సాగు ద్వారా భూసారాన్ని పెంచుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

## ఖమ్మంలో ఘనంగా హరీష్ రావు జన్మదినం

**– అనాథాశ్రమంలో సేవా కార్యక్రమాలు**



**వేద న్యూస్, ఖమ్మం:**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదినం సందర్భంగా ఖమ్మం నగరంలోని బల్లెపల్లిలో ఉన్న మదర్ తెరిసా అనాథాశ్రమంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హరీష్ రావు అభిమాని తరుణ్ తేజ కనకచర్ల తన మిత్రులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం అనాథాశ్రమంలోని పిల్లలకు స్నాక్స్, కూల్‌డ్రింక్స్ పంపిణీ చేసి వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా తరుణ్ తేజ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ఖమ్మంలో హరీష్ రావు జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొట్ల నితీష్, సాయిచరణ్ దమలపాటి, పవన్ సింగ్ ఠాకూర్, గణేష్ తుమలపూడి తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట హరీష్ రావు జన్మదిన వేడుకలు

**– అనాథ చిన్నారులకు అన్నదానం, నోట్‌బుక్స్ పంపిణీ**



**వేద న్యూస్, మహబూబాబాద్:**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి ఫరీద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మానుకోటలోని శ్రీ దివ్య కృప అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు నోట్ బుక్స్, పండ్లను పంపిణీ చేశారు. ఆశ్రమంలోని పిల్లలు హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండి ఫరీద్ మాట్లాడుతూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తున్న హరీష్ రావు మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొమ్మకంటి వెంకట్ గౌడ్, దుగ్గి రాంగోపాల్, ఎస్‌కే జవీద్, మోతుకురి యువరాజ్, మహమ్మద్ గాయాజ్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.50 లక్షల రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**– అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే మేడిపల్లి**



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలం కోనేరుపల్లె గ్రామం నుంచి రామడుగు మండలం కొక్కెరకుంట వరకు రూ.50 లక్షల సూడా నిధులతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పాల్గొన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన కుల సంఘ భవనాల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కోనేరుపల్లె, కాట్నపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రుక్మపూర్ గ్రామానికి చెందిన మ్యాకల కొమురయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు కాసు వేణుగోపాల రాజు, గన్ను శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో ముందుకు సాగుతున్న ప్రజా ప్రభుత్వం

**– బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్**



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

ప్రజా సహకారం, ప్రణాళికాబద్ధమైన విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ద్వారా పరిశుభ్రత, ఆరోగ్యం, రైతు సంక్షేమం, విద్య, ఉపాధి, మహిళా సంక్షేమం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని, చికిత్స పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయని నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు.

## సంఘ భవన నిర్మాణంపై సమీక్ష సమావేశం

**– అలుమ్ని భవన నిర్మాణ పనుల పురోగతిపై చర్చ**
**– పూర్వ విద్యార్థి కొండల్‌రావుకు నివాళి**



**వేద న్యూస్, హనుమకొండ:**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (అలుమ్ని అసోసియేషన్) అత్యవసర సమావేశం సంఘ అధ్యక్షులు ఇ.వి. శ్రీనివాస్ రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించబడింది. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల మరణించిన సీనియర్ పూర్వ విద్యార్థి, అసిస్టెంట్ ఇంజనీర్ తక్కళ్లపల్లి కొండల్‌రావుకు సభ్యులు ఘన నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం అలుమ్ని అసోసియేషన్ భవన నిర్మాణ పనుల పురోగతి, భూమి పూజ కార్యక్రమం, నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు, సభ్యుల సహకారం తదితర అంశాలపై చర్చించారు. భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నిర్ణయించారు. అలాగే పూర్వ విద్యార్థుల మధ్య సమన్వయం పెంపొందించడం, సంఘ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడం, భవిష్యత్ కార్యాచరణపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమావేశంలో కోశాధికారి ఆనంద్, టీఎన్ స్వామి, ఎం. ప్రకాష్, బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్ రావు, ఉమేందర్, సుధాకర్ రావు, వెంకటస్వామి, ధర్మ శ్రీనివాస్ రెడ్డి, శశి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఆర్ చేసి నిండు ప్రాణం కాపాడిన కానిస్టేబుల్



**– గుండెపోటుతో కుప్పకూలిన వ్యక్తికి సకాలంలో సాయం – కానిస్టేబుల్ భాస్కర్‌ను అభినందించిన ఎస్పీ**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా కోర్టు ఆవరణలో గుండె నొప్పితో కుప్పకూలిన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కొనరావుపేట పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ భాస్కర్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అభినందించారు. ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ కోర్టుకు హాజరైన సమయంలో అకస్మాత్తుగా గుండె నొప్పితో కుప్పకూలిపోయారు. ఈ ఘటనను గమనించిన కానిస్టేబుల్ భాస్కర్ వెంటనే స్పందించి సీపీఆర్ చేయడంతో బాధితుడు స్పృహలోకి వచ్చి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కానిస్టేబుల్ చాకచక్యంగా వ్యవహరించడంతో లక్ష్మణ్ ప్రాణాలతో బయటపడగా, భాస్కర్ సేవలను నెటిజన్లు, స్థానికులు ప్రశంసిస్తున్నారు. గుండెపోటు బాధితులకు అత్యవసర పరిస్థితుల్లో సాయం అందించేందుకు పోలీసులకు అందించిన సీపీఆర్ శిక్షణ మరోసారి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిందని అధికారులు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే పేదల సొంతింటి కల సాకారం

**– ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ కార్యక్రమం**



**వేద న్యూస్, దేవరకద్ర:**

కౌకుంట్ల మండల కేంద్రంలో ఐదు ఇందిరమ్మ ఇళ్లకు బుధవారం మార్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కిషన్ రావుతో కలిసి సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ లబ్ధిదారుల స్థలాలను పరిశీలించి మార్కింగ్ చేయించారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ పేదలకు ఇళ్లు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. పదేళ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పేదల సొంతింటి కలను నెరవేర్చడం సంతోషకరమని పేర్కొన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చొరవతో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఎంపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు కురవ కొండన్న, మండల ఓబీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బెందుల ప్రభు, వార్డు సభ్యులు శాంతం రవీందర్ రెడ్డి, కావలి లక్ష్మణ్, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీడీ డిస్పెన్సరీకి ప్రభుత్వ స్థలం కేటాయించాలి



**– మున్సిపల్ కమిషనర్‌కు అఖిలపక్ష నేతల వినతిపత్రం**

**వేద న్యూస్, దేవరకద్ర (అమరచింత):**

అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన బీడీ డిస్పెన్సరీ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని అఖిలపక్ష నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆస్పత్రి భవన నిర్మాణం కోసం ఓ స్వచ్ఛంద సంస్థ రూ.2 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. భవన నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని మాత్రమే కేటాయించాలని కమిషనర్‌ను కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బీడీ డిస్పెన్సరీ నిర్మాణం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం జూన్ 04 , 2026

# సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

- జూన్ 5న కరివేన ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

**వేద న్యూస్, దేవరకద్ర:**



ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల పర్యటనలో భాగంగా జూన్ 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కరివేన ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమావేశమై పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# అయిజలో అక్రమ మొరం దందా

- రాత్రివేళల్లో యథేచ్ఛగా మొరం తరలింపు
- భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న రహదారి
- స్పందించని సంబంధిత అధికారులు

**వేద న్యూస్, అయిజ:**



అయిజ మున్సిపాలిటీలో అక్రమ మొరం తరలింపు జోరుగా సాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో మొరం తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలోని 4వ వార్డులో భారీ వాహనాల రాకపోకల కారణంగా కల్వర్టు పూర్తిగా కుంగిపోయింది. దీంతో ఆ మార్గంలో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల రాత్రి సమయంలో మట్టి, మొరం, ఇసుక టిప్పర్లు అధికంగా సంచరించడం వల్ల రోడ్లు, కల్వర్టులు దెబ్బతింటున్నాయని కాలనీ వాసులు చెబుతున్నారు. అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవడంతో పాటు దెబ్బతిన్న కల్వర్టుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలను నియంత్రించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# వడ్ల బస్తాల చోరీ ముఠా అరెస్ట్

- పలు మండలాల్లో 242 వడ్ల బస్తాల దొంగతనం
- రూ.3.05 లక్షల నగదు, రెండు కార్లు స్వాధీనం
- నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు




**వేద న్యూస్, శాయంపేట:**

పలు మండలాల్లో వడ్ల బస్తాలను దొంగిలించి విక్రయిస్తున్న ముఠాను శాయంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.3,05,200 నగదు, రెండు కార్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పరకాల ఏసీపీ సతీష్ బాబు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమకొండకు చెందిన దామెర ప్రతీక్, జీడి రాహుల్, నల్లబెల్లి మండలం గోవిందాపూర్‌కు చెందిన షేక్ అస్లం, శాయంపేట మండలం వసంతపూర్‌కు చెందిన కొడపాక హేమంత్, హనుమకొండ మండలం వడ్డేపల్లికి చెందిన బిష్ట్ అనితతో పాటు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వ్యసనాలకు బానిసైన ఈ ముఠా అయినవోలు, కమలాపూర్, దామెర, హసన్‌పర్తి, శాయంపేట మండలాల్లోని వడ్ల కల్లాల వద్ద నుంచి మొత్తం 242 వడ్ల బస్తాలను దొంగిలించినట్లు తెలిపారు. సుమారు రూ.3.26 లక్షల విలువైన 135.86 క్వింటాళ్ల వడ్లను కార్లలో తరలించి, గీసుకొండ మండలం గొర్రెకుంటలోని ఓ రైస్‌మిల్లులో విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు వెల్లడించారు. మరో చోరీకి ప్రణాళిక రూపొందించి శాయంపేట మండలం వసంతపూర్ గ్రామ శివారులో రెక్కీ నిర్వహిస్తుండగా, కొప్పుల బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని ఎస్సై జక్కుల పరమేశ్వర్ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై జక్కుల పరమేశ్వర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

- హరీష్ జన్మదిన సేవా కార్యక్రమం
- విద్యార్థులకు అవసరమైన సహాయం
- ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ

**వేద న్యూస్ హైదరాబాద్ :**



మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ యువ నాయకుడు లావంగు నవీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఘనంగా సాగింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం గురించి తెలుసుకున్నారు. చదువులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ హరీష్ రావు జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు అవసరమైన సహాయం అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్య ద్వారా మాత్రమే భవిష్యత్తు మారుతుందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. లావంగు నవీన్ మాట్లాడుతూ హరీష్ రావు జన్మదిన సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు, ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజ సేవకు ప్రాధాన్యం ఇస్తూ కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందించడం వల్ల వారికి ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. హరీష్ రావు జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ప్రశంసనీయమని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. విద్యార్థుల సంక్షేమానికి తోడ్పడే కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# ఆమనగల్లులో ఘనంగా బడిబాట

- బడీడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలి
- సర్పంచ్ సందీప్



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామంలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పిల్లల సందీప్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు కాలనీల్లో అవగాహన ర్యాలీ చేపట్టి బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సందీప్ మాట్లాడుతూ విద్య ప్రతి చిన్నారి హక్కు అని, పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది విద్యేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామంలో ఏ చిన్నారి కూడా చదువుకు దూరం కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొల్చారం పోలీస్ స్టేషన్ తనిఖీ

**వేద న్యూస్ మెదక్ :**




కొల్చారం పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీసు అధికారి డి.వి. శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పనితీరు, పెండింగ్ కేసుల స్థితి, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి పెండింగ్ కేసులను త్వరిత గతిన పూర్తి చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. తనిఖీ సందర్భంగా స్టేషన్ రికార్డులు, కేసుల పురోగతి, విధుల నిర్వహణ తీరును జిల్లా పోలీసు అధికారి పరిశీలించారు. ప్రతి కేసును నిబంధనలకు అనుగుణంగా విచారించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కేసుల పెండింగ్‌ను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులకు చెప్పారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరంగా స్వీకరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అధికారులకు సూచనలు చేశారు. రహదారి భద్రత అంశంపై కూడా ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, సరైన పత్రాలు లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మోటారు వాహన నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణతో పాటు ట్రాఫిక్ క్రమశిక్షణను మెరుగుపరచడంలో పోలీసుల పాత్ర కీలకమని ఎస్పీ తెలిపారు. అనుమానాస్పద వాహనాలపై నిరంతర తనిఖీలు నిర్వహించడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రజల్లో కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌ల పనితీరును మరింత మెరుగుపరచేందుకు ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని జిల్లా పోలీసు అధికారి స్పష్టం చేశారు. క్రమశిక్షణ, బాధ్యతాయుత విధుల నిర్వహణ ద్వారా ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని అధికారులను ఆదేశించారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

**వేద న్యూస్ ఖమ్మం :**



ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు. మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు అరవైవ డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేపట్టారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను సమీక్షించారు. హార్టికల్చర్ అధికారి, సహాయ మున్సిపల్ కమిషనర్ రహదారులు, అంతర్గత వీధులు, కాలువలు, చెత్త సేకరణ కేంద్రాలను సందర్శించి పారిశుధ్య పనుల పురోగతిని పరిశీలించారు. చెత్త తొలగింపు, శుభ్రత కార్యక్రమాలు సమర్థవంతంగా జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా కాలువలను పూర్తిగా శుభ్రం చేయాలని సూచించారు. చెత్త నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవడం ద్వారా ముంపు సమస్యలను నివారించాలని పేర్కొన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు యాంటీ లార్వా కార్యక్రమాలను మరింత ముమ్మరం చేశారు. దోమల పెరుగుదలకు అనుకూల ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకర జీవనానికి అవసరమని వివరిస్తున్నారు. నగర ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛమైన ఖమ్మం నిర్మాణమే లక్ష్యమని అధికారులు తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణ, చెత్త నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ఖమ్మం కోసం మున్సిపల్ యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

వేద న్యూస్

గురువారం జూన్ 04 , 2026

# ఆఫ్ఘాన్ టెస్టుకు సిరాజ్ ఆడటంపై సందిగ్ధత




**వేద న్యూస్ డెస్క్:**

టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు అందుబాటులో ఉండటంపై అనిశ్చితి నెలకొంది. ఇటీవల ముగిసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో వరుసగా మ్యాచ్‌లు ఆడిన నేపథ్యంలో అతనిపై పనిభారం పెరగడంతో విశ్రాంతి ఇవ్వాలా అనే అంశాన్ని భారత జట్టు యాజమాన్యం పరిశీలిస్తోంది. ఈ విషయంపై వచ్చే రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. జూన్ 6 నుంచి చండీగఢ్‌లోని న్యూ పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ మైదానంలో భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్టు ప్రారంభం కానుంది. గుజరాత్ టైటాన్స్ తరపున ఐపీఎల్ మొత్తం సీజన్ ఆడిన సిరాజ్ ఫైనల్ వరకు జట్టుతో కొనసాగాడు. దీంతో అతనికి విశ్రాంతి అవసరమని వైద్య బృందం, జట్టు నిర్వహణ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సిరాజ్ జట్టుతో కలిసి చండీగఢ్‌లోనే ఉండి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉన్నాడు. ఒకవేళ సిరాజ్‌కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయిస్తే, జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ పేసర్ అకీబ్ నబీకి జట్టులో అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అకీబ్ నబీ 2025-26 రంజీ సీజన్‌లో 60 వికెట్లు పడగొట్టి తన జట్టును ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం నెట్ బౌలర్‌గా భారత జట్టుతో ఉన్న అతడిని ప్రధాన జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. అదే సమయంలో యువ పేసర్ గుర్‌నూర్ బ్రార్ టెస్టు అరంగేట్రం చేసే సూచనలు కూడా బలంగా కనిపిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌పై పూర్తిగా అనుభవంలేని బౌలింగ్ దళంతో బరిలోకి దిగడం సెలక్టర్లకు ఇష్టం లేకపోయినా, సిరాజ్ గైర్హాజరీలో యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ మ్యాచ్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగం కాకపోయినా, భవిష్యత్ సిరీస్‌లకు జట్టును సిద్ధం చేసే దిశగా కీలకంగా మారింది. అనంతరం ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది. ఆటగాళ్ల ఫిట్‌నెస్, పనిభార నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి సిరాజ్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. అతడు ఆడతాడా లేదా అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది.

# రోహిత్, హార్దిక్‌కు బీసీసీఐ పిలుపు

**వేద న్యూస్ డెస్క్:**




ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. టీమిండియా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా వెంటనే బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరానికి హాజరుకావాలని బోర్డు ఆదేశించింది. రాబోయే సిరీస్‌కు ముందు ఆటగాళ్ల శారీరక దృఢత్వం, మ్యాచ్ సన్నద్ధతను పూర్తిస్థాయిలో అంచనా వేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల ముగిసిన ఐపీఎల్ సీజన్ అనంతరం రోహిత్ శర్మ విశ్రాంతితో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించగా, హార్దిక్ పాండ్యా గాయం నుంచి కోలుకుంటున్న పరిస్థితిలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఇద్దరికీ జాతీయ క్రికెట్ అకాడమీలో ప్రత్యేక ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టి వారి శారీరక సామర్థ్యాన్ని పరిశీలించనున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌కు ముందు కీలక ఆటగాళ్లు అత్యుత్తమ ఫామ్‌లో ఉండేలా చూడటంతో పాటు జట్టు సమతుల్యతను మెరుగుపరచడమే బోర్డు లక్ష్యంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ముందున్న రద్దీ షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని ఆటగాళ్ల పనిభార నిర్వహణ, ఫిట్‌నెస్ ప్రమాణాల విషయంలో రాజీపడకూడదని బీసీసీఐ భావిస్తోంది. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యాలకు ప్రత్యేక శిబిరంలో పాల్గొనాలని స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

## ప్రపంచకప్‌కే ప్రాధాన్యం ఇవ్వండి: మంధాన



**వేద న్యూస్ డెస్క్:**

మహిళల ఇరవై ఓవర్ల ప్రపంచకప్2026 ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో భారత మహిళల క్రికెట్ జట్టు ఉప కెప్టెన్ స్మృతి మంధాన అభిమానులు, మీడియాకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. కేవలం భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌పైనే దృష్టి కేంద్రీకరించకుండా, మొత్తం ప్రపంచకప్‌కు ఆదరణ లభించేలా ప్రచారం చేయాలని ఆమె కోరారు. మహిళల క్రికెట్ అభివృద్ధికి ప్రతి మ్యాచ్‌కు సమాన ప్రాధాన్యం ఇవ్వడం అవసరమని పేర్కొన్నారు. జూన్ 12 నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో జూన్ 14న బర్మింగ్‌హామ్ వేదికగా భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. అయితే ప్రపంచకప్‌లో పాల్గొనే ఇతర జట్లు, ఇతర మ్యాచ్‌లు కూడా అంతే ప్రాముఖ్యత కలిగినవేనని మంధాన అభిప్రాయపడ్డారు. భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన మూడో ఇరవై ఓవర్ల మ్యాచ్ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆమె, మహిళల క్రికెట్‌కు లభిస్తున్న ఆదరణను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు వేల ఇరవై రెండులో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌కు అద్భుతమైన స్పందన లభించిందని, ఆ మ్యాచ్ టికెట్లు చాలా వేగంగా అమ్ముడయ్యాయని గుర్తు చేశారు. అయితే ఒకే మ్యాచ్‌కు పరిమితమైన ఆసక్తి సరిపోదని ఆమె స్పష్టం చేశారు. "భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌కు సహజంగానే పెద్ద ఎత్తున ప్రచారం ఉంటుంది. కానీ ప్రపంచకప్‌లోని ప్రతి మ్యాచ్‌కు కూడా అదే స్థాయిలో ఆదరణ రావాలి. మహిళల క్రికెట్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలంటే అభిమానులు, మీడియా అందరూ కలిసి కృషి చేయాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ ప్రేమికులు మాకు మద్దతుగా నిలుస్తారని నమ్ముతున్నాను. వారి అండతో మేము అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం" అని మంధాన తెలిపారు. ఈ ప్రపంచకప్‌లో భారత్ 'ఎ' గ్రూపులో ఉంది. లీగ్ దశలో తొలి మ్యాచ్‌ను పాకిస్థాన్‌తో ఆడనుంది. ఆ తర్వాత నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా జట్లతో వరుసగా తలపడనుంది. గ్రూపులో ఉన్న జట్లన్నీ బలమైనవే కావడంతో ప్రతి మ్యాచ్ కూడా కీలకంగా మారనుంది. సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే భారత జట్టు నిలకడైన ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. ఇటీవలి కాలంలో భారత మహిళల జట్టు ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల ఇరవై ఓవర్ల సిరీస్‌ను రెండుఒకటి తేడాతో కోల్పోయింది. అంతకుముందు దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో నాలుగుఒకటి తేడాతో ఓటమి చవిచూసింది.

# ప్రజ్ఞానందకు మరో ఘన విజయం..

**వేద న్యూస్ డెస్క్:**



భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మరోసారి ప్రపంచ చెస్ వేదికపై తన సత్తా చాటాడు. నార్వే చెస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు మ్యాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి సంచలనం సృష్టించాడు. క్లాసికల్ విభాగంలో కార్ల్‌సన్‌పై సాధించిన ఈ విజయం ప్రజ్ఞానందకు ఈ ఏడాదిలో రెండో గెలుపు కావడం విశేషం. డబుల్ రౌండ్ రాబిన్ విధానంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ప్రజ్ఞానంద అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఇప్పటివరకు 12 పాయింట్లు సాధించిన అతడు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ ఏడాది క్లాసికల్ చెస్‌లో కార్ల్‌సన్‌పై రెండుసార్లు విజయం సాధించిన తొలి ఆటగాడిగా ప్రజ్ఞానంద అరుదైన ఘనత అందుకున్నాడు.మరోవైపు ప్రపంచ చాంపియన్ డీ గుకేశ్‌కు నిరాశ ఎదురైంది. ఎనిమిదో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన గ్రాండ్‌మాస్టర్ అలిరేజా ఫిరౌజా చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో గుకేశ్ పాయింట్ల పట్టికలో దిగువ స్థానాల్లోనే కొనసాగుతున్నాడు.

# భారత్-న్యూజిలాండ్ మధ్య చరిత్రాత్మక క్రికెట్ సిరీస్

**వేద న్యూస్ డెస్క్:**




భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య చరిత్రలోనే అతిపెద్ద ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌కు రంగం సిద్ధమైంది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1 వరకు దాదాపు 40 రోజుల పాటు కొనసాగే ఈ పర్యటనలో మొత్తం 12 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో ఐదు ఇరవై ఓవర్ల మ్యాచ్‌లు, ఐదు ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్‌లు, రెండు టెస్టు మ్యాచ్‌లు ఉన్నాయి. రెండు దేశాల మధ్య క్రీడా సంబంధాలకు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రత్యేక సిరీస్‌ను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఇంత పెద్ద స్థాయిలో ద్వైపాక్షిక సిరీస్ ఎప్పుడూ జరగలేదు. అక్టోబర్ 22న క్రైస్ట్‌చర్చ్‌లో తొలి ఇరవై ఓవర్ల మ్యాచ్‌తో సిరీస్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఐదు ఇరవై ఓవర్ల మ్యాచ్‌లు పూర్తయ్యాక ఒకరోజు అంతర్జాతీయ సిరీస్ ప్రారంభమవుతుంది. నవంబర్ 4న ఆక్లాండ్‌లో తొలి ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. టెస్టు సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లో జరుగుతుంది. రెండో టెస్టు నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లో నిర్వహించనున్నారు. న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రధాన మార్కెటింగ్ అధికారి గ్లెన్ క్రిట్‌చెల్లీ మాట్లాడుతూ, ఇది కేవలం క్రికెట్ సిరీస్ మాత్రమే కాదని, రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబించే వేడుకగా కూడా నిలుస్తుందని తెలిపారు. భారత్ స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వంటి ప్రముఖ ఆటగాళ్లు కూడా ఈ పర్యటనలో పాల్గొనే అవకాశం ఉందని, వారి రాకకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. 2019-20 సీజన్ తర్వాత భారత్ న్యూజిలాండ్‌లో పర్యటించలేదు. అయితే ఆ తర్వాత రెండు సార్లు న్యూజిలాండ్ జట్టు భారత్‌లో పర్యటించింది. ఈ నేపథ్యంలో రానున్న ఈ భారీ సిరీస్‌పై ఇరు దేశాల క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

## ప్రపంచకప్‌లో భారతీయ మూలాల ముగ్గురు ఆటగాళ్ల సందడి

**వేద న్యూస్ డెస్క్:**




ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్2026కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల సంయుక్త ఆతిథ్యంలో జూన్ 11 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. భారత జాతీయ జట్టు ఈ ప్రపంచకప్‌కు అర్హత సాధించక పోయినా, భారతీయ మూలాలున్న ముగ్గురు యువ ఫుట్‌బాలర్లు వేర్వేరు దేశాల తరపున బరిలోకి దిగనుండటం భారత అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఖతార్ జట్టుకు ఎంపికైన తహ్సీన్ మహ్మద్ జంషీద్ ఈ జాబితాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కేరళలోని కన్నూర్ జిల్లాకు చెందిన మలయాళీ కుటుంబ మూలాలు కలిగిన తహ్సీన్ ప్రస్తుతం ఖతార్ లీగ్‌లో అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందాడు. కేవలం 19 ఏళ్ల వయసులోనే ప్రపంచకప్ తుది జట్టులో స్థానం సంపాదించడం ద్వారా అతడు అరుదైన ఘనతను అందుకున్నాడు. న్యూజిలాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సర్‌ప్రీత్ సింగ్ కూడా భారతీయ మూలాలున్న ప్రముఖ ఆటగాడు. పంజాబీ కుటుంబానికి చెందిన ఆయన, న్యూజిలాండ్ తరపున కీలక మిడ్‌ఫీల్డర్‌గా రాణిస్తున్నాడు. గతంలో యూరప్‌లోని ప్రముఖ క్లబ్‌ల తరపున ఆడిన అనుభవం కలిగిన సర్‌ప్రీత్, న్యూజిలాండ్ ప్రపంచకప్ అర్హత సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆస్ట్రేలియా జట్టులో చోటు దక్కించుకున్న నిషాన్ వేలుపిళ్లై మరో భారతీయ మూలాల ఆటగాడు. తమిళ కుటుంబ నేపథ్యం కలిగిన నిషాన్, వేగవంతమైన వింగర్‌గా గుర్తింపు పొందాడు. ప్రపంచకప్‌లో ఆడనున్న తొలి తమిళ సంతతి ఫుట్‌బాలర్‌గా ఆయన చరిత్ర సృష్టించనున్నాడు. ఇక భారతీయ మూలాలున్న మరో ఆటగాడు నైలు ఆద్య మేసన్ తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఫిట్‌నెస్ సమస్యలు, జట్టు సమీకరణాల కారణంగా అతని పేరు చివరి క్షణంలో జాబితా నుంచి తప్పించబడింది. భారత జట్టు ఈ టోర్నీలో లేకపోయినా, భారతీయ మూలాలున్న ఈ ముగ్గురు ఆటగాళ్ల ప్రదర్శన ప్రపంచకప్ సందర్భంగా భారత అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. వారి విజయాలు ప్రపంచ ఫుట్‌బాల్ వేదికపై భారతీయ వారసత్వానికి మరింత గుర్తింపు తీసుకురావాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# ఐపీఎల్2027కు కమిన్స్ దూరమా? ఎస్‌ఆర్‌హెచ్‌లో చర్చనీయాంశం

**హైదరాబాద్, జూన్ 3 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**




సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను ఆందోళనకు గురిచేసే వార్త ఒకటి క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆస్ట్రేలియా స్టార్ పేసర్, ఎస్‌ఆర్‌హెచ్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఐపీఎల్2027 సీజన్‌కు దూరంగా ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. వచ్చే ఏడాది ఆస్ట్రేలియా జట్టుకు అత్యంత కీలకమైన అంతర్జాతీయ షెడ్యూల్ ఉండనుంది. యాషెస్ సిరీస్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్, వన్డే ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలు వరుసగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో జట్టుకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కమిన్స్ ఐపీఎల్‌కు విరామం ఇవ్వాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నిరంతర క్రికెట్ కారణంగా శారీరక అలసట, గాయాల ప్రమాదం పెరుగుతుందని భావిస్తున్న కమిన్స్, జాతీయ జట్టు బాధ్యతలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. గతంలో కూడా పలువురు ఆస్ట్రేలియా ఆటగాళ్లు అంతర్జాతీయ టోర్నీల దృష్ట్యా ఐపీఎల్‌కు దూరమైన సందర్భాలు ఉన్నాయి. ఒకవేళ కమిన్స్ నిజంగానే ఐపీఎల్2027లో ఆడకపోతే సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్త కెప్టెన్ ఎంపికపై దృష్టి సారించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న ఇషాన్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశముందని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే కమిన్స్ భవిష్యత్తు, ఎస్‌ఆర్‌హెచ్ కెప్టెన్సీపై ప్రస్తుతం అధికారిక స్పష్టత లేదు. ఫ్రాంచైజీ లేదా ఆటగాడి నుంచి ప్రకటన వెలువడే వరకు ఈ వార్తలను ఊహాగానాలుగానే పరిగణించాల్సి ఉంటుంది. ఎస్‌ఆర్‌హెచ్ అభిమానులు మాత్రం కమిన్స్ జట్టుతోనే కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేద న్యూస్

గురువారం జూన్ 04 , 2026

# తారక్‌తోనే బెస్ట్ కెమిస్ట్రీ.. ఇలియానా వ్యాఖ్యలు మళ్లీ వైరల్



**వేద న్యూస్ డెస్క్:**

ఒకప్పుడు టాలీవుడ్‌ను తన అందం, అభినయం, గ్లామర్‌తో ఏలిన గోవా భామ ఇలియానా డి క్రూజ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం కుటుంబ జీవితంలో బిజీగా ఉన్న ఆమె గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో మళ్లీ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమలో తాను నటించిన అగ్ర హీరోల్లో ఎవరితో తన స్క్రీన్ కెమిస్ట్రీ అత్యుత్తమంగా అనిపించిందనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం నందమూరి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. తెలుగు చిత్రసీమలో మహేష్ బాబు, ప్రభాస్, రామ్ పోతినేని, జూనియర్ ఎన్.టి.ఆర్ వంటి అగ్ర కథానాయకులతో కలిసి నటించిన ఇలియానా తన కెరీర్‌లో ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నారు. అలాంటి సమయంలో ఒక ఇంటర్వ్యూలో యాంకర్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, తాను నటించిన హీరోల్లో జూనియర్ ఎన్.టి.ఆర్‌తోనే తన స్క్రీన్ కెమిస్ట్రీ అత్యుత్తమంగా పనిచేసిందని వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లోనే అభిమానుల దృష్టిని ఆకర్షించగా, ప్రస్తుతం తారక్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న నేపథ్యంలో మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఇలియానా, జూనియర్ ఎన్.టి.ఆర్ కాంబినేషన్‌లో వచ్చిన 'రాఖీ', 'శక్తి' చిత్రాలు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు పొందాయి. ముఖ్యంగా దర్శకుడు కృష్ణవంశీ తెరకెక్కించిన 'రాఖీ' చిత్రంలో వీరిద్దరి మధ్య సాగే ప్రేమకథ, భావోద్వేగ సన్నివేశాలు, పాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సినిమాలో తారక్ ఎనర్జీకి తగ్గట్టుగా ఇలియానా నటన, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ చిత్రంలోని పాటలు ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. ఇలియానా కెరీర్‌లో పోకిరి, మున్నా, దేవదాసు వంటి భారీ విజయాలు ఉన్నప్పటికీ, నటన పరంగా మరియు తెరపై అనుబంధం పరంగా తారక్‌తో పనిచేసిన అనుభవం ప్రత్యేకమని ఆమె చెప్పినట్లు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. మహేష్ బాబుతో 'పోకిరి', ప్రభాస్‌తో 'మున్నా', రామ్‌తో 'దేవదాసు' వంటి చిత్రాలు ఆమెకు స్టార్‌డమ్ తీసుకొచ్చినా, తారక్‌తో ఉన్న సహజమైన అనుబంధమే ఆమెను ఈ వ్యాఖ్యలు చేయడానికి ప్రేరేపించిందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. తెలుగు చిత్రసీమలో ఇలియానా ప్రయాణం కూడా ఎంతో ప్రత్యేకమైనది. 'దేవదాసు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. వరుస విజయాలతో అగ్ర కథానాయికగా నిలిచిన ఆమె, ఒక దశలో తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యధిక పారితోషికం అందుకున్న నటీమణుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ముఖ్యంగా మహేష్ బాబుతో చేసిన 'పోకిరి' చిత్రం ఆమె కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఆ సినిమా విజయం తర్వాత నిర్మాతలు, దర్శకులు ఆమె కోసం క్యూ కట్టారు. అనంతరం బాలీవుడ్ వైపు అడుగులు వేసిన ఇలియానా అక్కడ కూడా పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. అయితే వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తూ క్రమంగా సినిమాలకు దూరమయ్యారు. ప్రస్తుతం తన కుటుంబంతో సంతోషంగా గడుపుతూ సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో నిరంతరం అనుసంధానంగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా, ఇలియానా చేసిన ఈ పాత వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ వెలుగులోకి రావడంతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "తారక్‌తో ఇలియానా జోడీ ఎప్పటికీ ప్రత్యేకమే", "రాఖీ సినిమాలో వీరిద్దరి కెమిస్ట్రీ ఇప్పటికీ గుర్తుండిపోతుంది", "ఇలియానా చెప్పింది నిజమే" అంటూ అభిమానులు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతూ వైరల్‌గా మారింది.

## 'కరుప్పు' విజయం తర్వాత విజయ్‌ను కలిసిన దర్శకుడు



**వేద న్యూస్ డెస్క్:**

భారీ విజయాన్ని అందుకున్న 'కరుప్పు' చిత్ర దర్శకుడు ఆర్‌జే బాలాజీ తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'కరుప్పు' కథను తొలిసారిగా విన్న వ్యక్తి విజయ్ అని గుర్తు చేసుకుంటూ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో విజయ్‌ను కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, ఆయనలో ఇప్పటికీ అదే ప్రేమ, ఆప్యాయత, ప్రశాంతత కనిపిస్తున్నాయని ఆర్‌జే బాలాజీ సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు. ప్రస్తుతం 'కరుప్పు' చిత్రం భారీ వసూళ్లతో విజయవంతంగా ప్రదర్శితమవుతూ ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. ఈ చిత్రంలో సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో నటించగా, కథ, కథనాలతో పాటు భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విడుదలైన నాటి నుంచి మంచి స్పందన అందుకుంటున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను నమోదు చేస్తోంది. వాస్తవానికి 'కరుప్పు' కథను ఆర్‌జే బాలాజీ మొదట విజయ్ కోసం సిద్ధం చేశారు. రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించకముందు విజయ్ నటించే చిత్రంగా దీనిని తెరకెక్కించాలని భావించి కథను కూడా వినిపించారు. అయితే ఆ సమయంలో రాజకీయ బాధ్యతలు, ఇతర కారణాల దృష్ట్యా విజయ్ ఈ ప్రాజెక్ట్‌లో నటించలేకపోయారు. అయినప్పటికీ కథపై విజయ్ ఇచ్చిన సూచనలు, అడిగిన ప్రశ్నలు స్క్రిప్ట్‌ను మరింత మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించాయని ఆర్‌జే బాలాజీ గతంలో వెల్లడించారు. అందుకే చిత్ర ప్రారంభ శీర్షికల్లో విజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విజయ్ ఈ ప్రాజెక్ట్‌కు దూరమైన తర్వాత ఈ కథ ప్రముఖ నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌కు చేరగా, అనంతరం హీరో సూర్య ఈ చిత్రంలో నటించేందుకు అంగీకరించారు. చివరకు సూర్య ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'కరుప్పు' ఘన విజయాన్ని సొంతం చేసుకుని ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది.

## 'ఇరుముడి' గ్లింప్స్ విడుదల..




**వేద న్యూస్ డెస్క్:**

మాస్ మహారాజా రవితేజ హీరోగా, విజయవంతమైన దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి'కి సంబంధించిన తొలి దర్శన వీడియో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీమైత్రీ మూవీ మేకర్స్‌రినిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా విడుదలైన 'ఇరుముడి హృదయం' గ్లింప్స్ ఆ అంచనాలను మరింత పెంచేసింది. ఇప్పటివరకు రవితేజను ప్రధానంగా మాస్, కామెడీ, యాక్షన్ పాత్రల్లో చూసిన ప్రేక్షకులకు ఈ సినిమా పూర్తిగా భిన్నమైన అనుభూతిని ఇవ్వబోతున్నట్లు గ్లింప్స్ స్పష్టంచేసింది. ముఖ్యంగా తండ్రీకూతుళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని హృదయాన్ని తాకేలా చూపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కుటుంబ విలువలు, ఆధ్యాత్మికత, జీవిత పోరాటం, విముక్తి కోసం చేసే ప్రయాణం వంటి అంశాలను కథలో ప్రధానంగా మేళవించినట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌లో మద్యానికి బానిసైన ఒక వ్యక్తి జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు, ఆ తర్వాత అయ్యప్ప స్వామి భక్తి మార్గాన్ని ఎంచుకుని తనను తాను మార్చుకునే ప్రయత్నం ప్రధాన కథగా కనిపిస్తోంది. అయ్యప్ప దీక్ష చేపట్టిన తర్వాత అతను ఎదుర్కొన్న సవాళ్లు, కుటుంబ పరిస్థితులు, భావోద్వేగ సంఘర్షణలు, సామాజిక ఒత్తిళ్లు కథలో కీలకంగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయ్యప్ప భక్తి నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం కేవలం భక్తి కథగా మాత్రమే కాకుండా, ఒక మనిషి ఆత్మపరిశీలన, కుటుంబ బంధాల విలువ, జీవితాన్ని మార్చే ఆధ్యాత్మిక శక్తి గురించి చెప్పే భావోద్వేగ గాథగా ఉండబోతున్నట్లు గ్లింప్స్ సంకేతాలు ఇస్తోంది. దర్శకుడు శివ నిర్వాణ తన గత చిత్రాల మాదిరిగానే భావోద్వేగాలకు పెద్దపీట వేస్తూనే, రవితేజ ఇమేజ్‌కు తగ్గ మాస్ అంశాలను కూడా సమపాళ్లలో జోడించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, బాలనటి నక్షత్ర రవితేజ కుమార్తె పాత్రలో కనిపించనుంది. గ్లింప్స్‌లో తండ్రీకూతుళ్ల మధ్య చూపించిన సన్నివేశాలు ఇప్పటికే ప్రేక్షకుల హృదయాలను తాకుతున్నాయి. ఈ భావోద్వేగ బంధమే సినిమాకు ప్రధాన బలంగా నిలవొచ్చని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే సీనియర్ నటుడు సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, స్వాసిక తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరి పాత్రలు కథకు మరింత బలాన్ని చేకూర్చనున్నాయని సమాచారం. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. గ్లింప్స్‌లో వినిపించిన నేపథ్య సంగీతం కథలోని భావోద్వేగ తీవ్రతను మరింత పెంచింది. మరోవైపు ఛాయాగ్రాహకుడు విష్ణు శర్మ అందించిన దృశ్యాలు చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అయ్యప్ప దీక్ష, గ్రామీణ నేపథ్యం, భావోద్వేగ సన్నివేశాలను తెరపై అద్భుతంగా ఆవిష్కరించినట్లు గ్లింప్స్‌లో కనిపిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశకు చేరుకున్నట్లు సమా చారం. నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా వేగంగా కొనసాగుతున్నాయి.

# క్యాన్సర్‌ను జయించిన హంసా నందిని..


**వేద న్యూస్ డెస్క్:**



సినీ ఇండస్ట్రీలో హీరోయిన్‌గా రాణించాలని ఎంతో మంది కలలు కంటూ అడుగుపెడతారు. అయితే కొందరికి మాత్రమే స్టార్‌డమ్ దక్కుతుంది. మరికొందరు అవకాశాల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటారు. అలాంటి నటీమణుల్లో ఒకరు హంసా నందిని. పూణెలో జన్మించి పెరిగిన హంసా నందిని మోడలింగ్‌పై ఆసక్తితో ముంబైకి వెళ్లారు. 2002 నుంచి మోడలింగ్ రంగంలో కొనసాగుతూ పలు టెలివిజన్ ప్రకటనల్లో నటించారు. అనంతరం 2004లో విడుదలైన ఒకటవుదాం చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. హీరోయిన్‌గా పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయారు. దీంతో కొన్ని సినిమాల్లో రెండో కథానాయికగా నటించారు. అయినప్పటికీ పెద్దగా గుర్తింపు రాకపోవడంతో ప్రత్యేక గీతాల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 2013లో విడుదలైన మిర్చి, భాయ్, అత్తారింటికి దారేది, రామయ్యా వస్తావయ్యా, అలాగే లెజెండ్ చిత్రాల్లో చేసిన స్పెషల్ సాంగ్స్‌తో హంసా నందిని మంచి గుర్తింపు సంపాదించారు. అయితే కెరీర్ మంచి దశలో ఉండగానే 2021లో ఆమెకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు వెల్లడించారు. తన తల్లి కూడా క్యాన్సర్ కారణంగానే మరణించారని, జన్యుపరమైన కారణాల వల్ల తాను కూడా ఈ వ్యాధి బారిన పడ్డానని అప్పట్లో తెలిపారు. తీవ్ర మనోధైర్యంతో చికిత్స తీసుకుని క్యాన్సర్‌ను జయించిన హంసా నందిని ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. ప్రస్తుతం హంసా నందిని సోషల్ మీడియాలో చురుకుగా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. ఫొటోషూట్లు, వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అలాగే మంచి పాత్రల కోసం ఎదురుచూస్తూ మళ్లీ సినీ రంగంలో బిజీ కావాలని ప్రయత్నిస్తున్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధిని జయించి జీవితంలో ముందుకు సాగుతున్న హంసా నందిని ప్రయాణం అనేక మందికి ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందించే ఉదాహరణగా నిలుస్తోంది.

## పండు మాస్టర్‌కు రోడ్డు ప్రమాదం

**వేద న్యూస్ డెస్క్:**



తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితమైన ప్రముఖ నృత్య దర్శకుడు, నర్తకుడు పండు మాస్టర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం ప్రకారం, తగరపువలసలో నిర్వహించిన అమ్మవారి ఉత్సవాల్లో ప్రత్యేక నృత్య ప్రదర్శనలో పాల్గొన్న పండు మాస్టర్, కార్యక్రమం ముగిసిన అనంతరం తన బృందంతో కలిసి తిరుగు ప్రయాణం ప్రారంభించారు. ప్రయాణ మధ్యలో బృందంలోని ఓ సభ్యుడు అస్వస్థతకు గురికావడంతో వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో పండు మాస్టర్ వాహనం నుంచి దిగి రోడ్డుపై నిలబడి పరిస్థితిని గమనిస్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కోళ్ల రవాణా వాహనం అదుపుతప్పి ఆయనను ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అనంతరం ఆ వాహనం ఎదురుగా నిలిపి ఉన్న మరో కారును కూడా ఢీకొట్టింది.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పండు మాస్టర్‌ను స్థానికులు, ఆయన బృంద సభ్యులు వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, దెబ్బతిన్న ఇతర వాహనాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

## 'పెద్ది' విడుదలకు ముందే మెగా హంగామా

**వేద న్యూస్ డెస్క్:**



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమా విడుదలకు ముందే తెలుగు రాష్ట్రాల్లో అభిమానుల సందడి ఊపందుకుంది. దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ చిత్రంపై భారీ అంచనాలు నెలకొనడంతో అభిమానులు ఇప్పటికే థియేటర్ల వద్ద పండుగ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతం అభిమానుల సందడికి కేంద్రంగా మారింది. అర్జున్ థియేటర్ ఆవరణలో 'పెద్ది' సినిమాలో రామ్ చరణ్ పోషించిన పాత్రను ప్రతిబింబించేలా భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహానికి 'శ్రీ రామ్ చరణ్ ఆలయం' అనే పేరుతో ప్రత్యేక ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం విశేషంగా మారింది. గ్రామీణ నేపథ్యంలోని 'పెద్ది' పాత్రను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ విగ్రహం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. అభిమానులు పెద్ద సంఖ్యలో థియేటర్ వద్దకు చేరుకుని ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ సందడి చేశారు. కొందరు అభిమానులు విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించగా, మరికొందరు కర్పూర హారతులు ఇచ్చి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారుడప్పులు, బ్యానర్లు, నినాదాలతో థియేటర్ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ వేడుకలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందుతున్నాయి. అభిమానుల ఉత్సాహం చూస్తుంటే సినిమా విడుదల రోజున మరింత భారీ సంబరాలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073